
# పకోడీల దొడ్డమ్మ

అడవిలో పులులూ, సింహాలూ వున్నట్లే, మన చుట్టాల్లోకూడా పులులూ, సింహాలూ వుంటారు. మా "పకోడీల దొడ్డమ్మ"ను చూస్తే మా మదర్‌కి ఒకటే త్రెంబిలింగు గుండెదడ పట్టుకుంటుంది. ఒక పెద్ద స్వాములారు భిక్షకొస్తే లాకాయ లూకాయగాళ్ళు బెదిరినట్లు మా చుట్టాల్లో అంతా ఆవిడ్ని చూస్తే బెదుర్తారు. ఆవిడ విజిట్టుకూడా క్వయిటనస్పెక్టడ్‌గానే - ఎప్పుడొస్తుందో తెలీదు. ఎన్నాళ్ళుంటుందో మళ్ళీ ఎప్పుడు వెళుతుందో ఎవరికీ తెలీదు, ఆవిడ సూట్ వేసుకుని, టోపీ పెట్టుకుని ఏ ఛాంబరాఫ్ కామర్స్ మీటింగ్‌కో వెడితే ఆవిడే ఛేర్మన్ అనుకుని ప్రారంభోపన్యాసం యివ్వమనవచ్చు. ఆవిడే ఖద్దరులాల్చీ పంచె ధరించి గాంధీటోపీ పెట్టుకుంటే అచ్చం కాంగ్రెస్ అధ్యక్షుడిలాగుంటుంది. విగ్గు పెట్టుకుని నల్లకోటు వేసుకుని కోర్టుకెళితే ఆవిడ హైకోర్టు జడ్జీనో అనుకుని కోర్టు బంట్రోతులు, గుమస్తాలు, ప్లీడర్లు వంగి వంగి సలాములు చేస్తారు. ఆడవాళ్ళలో కూడా మగాళ్ళని మించిపోయిన పర్సనాలిటీ వాగ్ధాటి వున్నవారున్నారు! లేకేమి? సోదెమ్మగారు రైలుపెట్టెలోకెక్కగానే అంతకుముందు రాజకీయాలు, సినిమాలు, లోకాభిరామాయణం మాట్లాడుతున్నవారంతా మినిట్లో ఆవిడ లెక్చర్ విని 'అడియెన్ దాసోహ' మంటూ

ఫిలాసఫర్లయిపోతారు. కృష్ణ కర్ణామృతంనుంచి కాని, వాల్మీకి రామాయణం నుంచికాని ఆవిడ శ్లోకాలు చదివి వ్యాఖ్యానిస్తూంటే జనం గుడ్లు వెళ్ళబెట్టుకుని ఆవిడ తెలివితేటలకు డంగయిపోతారు. మనిషి రెండొందల పౌన్లకు పైనే వున్నప్పటికీ "ఈ తుచ్ఛ శరీర మివుడిందే కటిలన్ గ్రాలుచో. ఆ ఇల్లాలును, ఆ కుమారుడును తోడైరారు తప్పింపగన్" అన్నట్లు ఆవిడ చెబుతుంటే ప్రయాణీకులకి సామానుమీద చేస్తున్న ప్రయాణంమీదకూడా అక్కడికక్కడే పురాణవైరాగ్యం కలుగుతుంది. ఆవిడ నాలెడ్జి ఆవిడ ఆర్గ్యుమెంటు, ఆవిడ ఫిలాసఫీ వింటూంటే మన కల్చర్ మీద అమాంతం వెర్రిప్రేమ పుట్టుకొచ్చేసి ఏ అడవుల్లోకోపోయి ఆకు లలములు తింటూ, వనవాసంచేస్తూ తాపసులమై పోరాదా అనిపించి తీరుతుంది. మా సోదెమ్మగారే మగాడై ఇంగ్లీషు చదువులు చదివుంటే ఏ అమెరికాలోనో విజిథింగ్ ప్రొఫెసర్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ అయి లెక్చర్లిస్తూ వుండేది. అయితే పాపం ఆవిడ రిచ్ బ్రామిన్ విడో - చిన్నప్పుడే మొగుడు పోవడంవలన గుండు చేయించేసి యింట్లో కూర్చోపెట్టేసారు. ఆవిడ తరవాతావిడకూ కూడా అలాగే జరిగితే అలాగే గుండు చేయించి యింట్లో కూర్చోపెట్టేశారు. ఇద్దరికీ మనోవర్తి బాగానే వస్తుంది. పెద్దావిడది "రాజయోగం"అయితేచిన్నావిడ "భక్తి యోగం" పెద్ద సోదెమ్మగారు ప్రెసిడెంటయితే చిన్న సోదెమ్మగారు ప్రయిమినిష్టరు. పెద్దావిడ మూలవిరాట్టయితే చిన్నావిడ ఉత్సవ విగ్రహం. చిన్నావిడ సైకిల్ వెనక చక్రంలాగ అరిగిపోతూ చాకిరీతో సతమతమైపోతూ వుంటుంది. పెద్దావిడకు సంసారలంపట్టాలేవీలేవు. చిన్నావిడకు అన్నీకాళ్ళకు ముళ్ళే- ఈవిడ సేవలు చేయటానికి, ఆవిడ సేవలు చేయించుకోడానికి పుట్టిందని చుట్టాల్లో అనుకుంటారు. పెద్దావిడది చాలా అవుట్ డోర్ లైఫ్. కాశీ, రామేశ్వరం, మధుర, బృందావనం, హృషీకేశ్ వగయిరా వగైరాలు తిరిగొస్తూ వుంటుంది. స్వాములవార్లు వుపన్యాసాలు చేస్తున్నా పురాణాలు చెబుతున్నా వెళ్ళి విని వస్తుంది. పెద్ద పెద్ద స్వాములవార్లను ఆధ్యాత్మిక విషయాలగురించి అడిగి తెలుసుకుంటూ వుంటుంది. చిన్నావిడకు అవేం

పట్టవు. ఆవిడకు వంటలు వార్పులూ, పురుళ్ళూ, పుణ్యాలూ, వాళ్ళకూ వీళ్ళకూ చాకిరీ చేస్తూ ఆ పిల్లల్ని పెంచుతూ లంపటాలు పెంచుకుని లేనిపోని తాపత్రయాల్తో కొట్టుకు కొట్టుకుపోతూ వుంటుంది. కళ్ళలంలో పడ్డఈగలాగ. గుళ్లోకి వెళ్లినా స్వాములర్లు చెప్పినది వింటున్నా విన్న వేమీ ఆవిడ తలకెక్కవు. బియ్యాలు చెరుక్కోటం, పిండు కొట్టించటం వూరగాయలు పెట్టడం, పెద్దపనులూ, చిన్నపనులూ వీటితోనే జీవితం వెళ్లమారిపోతుంది. పెద్దావిడ ఠీవిగాని, ఆవిడ దర్జాకాని, అవిడ ఇన్ఫ్లూయన్స్ కాని ఈవిడకు లేవు రావు. పెద్దావిడకు బంధుకోటిలోనేకాక



చుట్టుపక్కల పైవాళ్ళలో కూడా శిష్యురాళ్లున్నారు. ఆవిడకు వేరే పీఠం లేకపోయినా, పీఠంవున్న స్వాములారకు మించిన పలుకుబడి వేరే భక్తి కూటం వుంది. వసిష్ఠులవారు శ్రీరామునికి ఏవేవి చెప్పారో అవన్నీ ఆవిడ అర్టిపండు ఒల్చినట్లు విడమర్చి సులువుగా ఆడాళ్ళకు చెప్పగల్దు—చెబుతూవుంటుంది. భక్తి జ్ఞాన వైరాగ్య శతకాలావిడకు కంఠతా వచ్చు. మండనమిశ్రుడి భార్య ఉదయభారతి శంకరులవారిని ఎలా పట్టిగొట్టిచ్చిందో ఆవిడ చెప్పగల్దు. ఉపనిషత్తులు ఏమంటున్నాయోకూడా ఆమె టూకీగా బోధపరచగల్దు. నచికేతుడు యముడ్ని అడిగిన ప్రశ్నలు, జవాబులూ

ఆవిడ చెబుతూంటే ఆడాళ్ళు నోరు తెర్చుకుని మారుప్రశ్న అడక్కుండా వినేవాళ్ళు. సంధ్యావందన శ్రీసూక్త, పురుషసూక్తాలు ఆవిడకు బై హార్ట్....కాని ఆవిడంటె మా మదర్ లాటి ఇన్నొసెంట్ లేడీస్‌కి లోపల్నుంచి చాలా ట్రెంబిలింగ్ ఎందుకు కలిగేదో తరవాత్తరవాత నాకు తెలిసింది

ఆవిడకు ప్రత్యేకం ఒక హాలుగాని, ఒక రూంగాని వుండాలి. అందులో తెల్లటి మల్లెపువ్వులాటి పక్కవేసి వుండాలి. పరుపుల మంచం మీదేకాని ఆవిడ చాపమీద పడుకోలేదు. పడుకుంటే ఆవిడకు వళ్ళంతా నెప్పులేసి మరి మర్నాడు లెక్చర్లివ్వడానికి లేవలేదు. టూర్లోవున్నప్పుడు కాషాయరంగు పట్టుపంచె కట్టుకున్నా మస్టీలో ఆవిడ తెల్లటి గ్లాస్కో పంచెలుకాని కట్టదు. రాజయోగం, జ్ఞానయోగం గురించే ఆవిడ మాట్లాడుతూంటుంది. కాని భక్తియోగంమీద కర్మయోగంమీద అవిడ కాట్టే నమ్మకంలేదు. పూజలు, వ్రతాలూ, నోములూ, ఆచారాలూ ఆవిడ పాటించదు. పొద్దున్న లేవగానే వేడీన్నీళ్ళు స్నానానికి రడీగా వుండాలి. మైసూర్ శాండల్‌సోపు తప్ప షికాయి, సున్నిపిండి, కుంకుడు కాయలు ఆవిడ వాడదు.

స్నానం చేయగానే అరడజను వేడి వేడి ఇడ్లీలు ప్రెస్టిజి కుక్కరు మించి దించినవి పొగలు గ్రక్కుతూండగా కారప్పొడి, కొబ్బరి చట్నీతోతినందే ఆవిడ వుండలేదు.ఉపాహారం కాగానేవచ్చిన కొంతమంది స్త్రీలకు భగవద్గీత చెప్పటమో లేక వారి సందేహాలు తీర్చటమో జరిగి పోతుంది. గడియారం పది కొట్టగానే ఆవిడకు సాంబారు, రెండు పచ్చళ్ళు, రెండు కూరలు, అప్పడం, వడియం ఊరగాయల్తో భోజనం అయిపోవాలి. భోజనానంతరం ఆవిడ పరుపుల మంచంమీద నడుం వాలుస్తుంది. మళ్ళీ మూడింటికి ఉల్లిపాయ పకోడీలో, బజ్జీలో వేసి పళ్ళెంలో ఎదురుగుండా కంటికి ఎదరగా పెట్టాలి. ఆ తరువాత నెస్‌కేఫ్ కాఫీ పుచ్చుకుని మధ్యాహ్నం వచ్చిన స్త్రీలకు మళ్ళీ ఉపన్యాసమో, భాగవత వివరణమో చెబుతుంది.

పుస్తకం చూడటం అనే క్వశ్చన్ లేదు. అంతా వాక్యాయకర్మే-సాయంత్రం హవాయికోళ్ళ ధరించి గుళ్ళకో, శిష్యురాళ్ళయిళ్లకో వెళ్ళి వస్తుంది. మళ్ళీ ఆరింటికల్లా ఆరడజన్ చక్కెరకేళీలు, రెండు మూడు బత్తాయిలు, ఒక ఆపిల్‌పండు, కంచెంబుడు పాలు తాగి చదువుకుంటూ పడుకుంటుంది. ఏ మగమహారాజుకికూడా ఇంత సిస్టమేటిక్కుగా జరగదు, జరిపించుకోలేడు. ఏమాత్రం లోటొచ్చినా ఆవిడకు ముక్కుమీదుంటుంది కోపం. ఆవిడతో ఎవరూ వాదించలేరుకనుక అందరూ ఆవిడకు ఝడుస్తూ వుంటారు. చిత్రమేమిటంటే పెద్ద సోదెమ్మగారు. రెండుశార్లు కాశీ వెళ్ళింది నిర్యాణానికంటూ - మళ్ళీ నిక్షేపంలా తిరిగొచ్చింది. కాని అంతకంటె ఆశ్చర్యకరమయిన విషయమేమిటంటే చిన్నసోదెమ్మగారు యింటిల్లిపాదికీ వండి పిండి వంటలు చేసి దేవుడికి నైవేద్యంపెట్టి అన్నాలు పెట్టుకోండర్రా అనిచెప్పి గుండెల్లో నొప్పిగావుందని చాప పర్చుకుని పడుకుని వైకుంఠ ఏకాదశినాడు నేరుగా వైకుంఠాని కెళ్ళిపోయింది. పెద్దావిడ యింతవరకు ఆ షాక్ నుండి తేరుకోలేదు. మా పకోడీల దొడ్డమ్మ యిప్పుడు కాశీలోవుంది. మూడోసారి ఆవిడ కాశీలో పోవడానికి ట్రయిచేస్తూవుంది. మా పకోడీల దొడ్డమ్మ రాజకీయాల్లో ప్రవేశించివుంటే ఇండియా భవిష్యత్ మనోరకంగా వుండేదేమోనని నేనను కుంటూ వుంటాను. బైదిబై ఆవిడంటే మా వారికి చెడ్డ భయం.... టెరిబుల్ లేడీ అంటారు. నాకావిడ మంచిదే - ఎందుకంటే వెండి పళ్ళెంలో ఆవిడ మిగిల్చిన పకోడీలు నాకే పెట్టేది. మన ఆడవాళ్ళలో తల్చుకుంటే ఎంతెంత లేసి మహాపురుషులయినా వున్నారు.